# ఎందుకీ పనిచేశావ్?

## -దూరి వెంకటరావు

ఆఫీసు నుంచి వస్తూనే "నాన్న ఏడి?" అని అడిగాడు ప్రణవ్.

"ఇంతసేపు ఇక్కడే ఉన్నారు. అంతలోనే ఎక్కడికెళ్లారు చెప్మా?' అంటూ అటూ ఇటూ చూసింది కీర్తన.

ఇల్లంతా వెతికాడు ప్రణవ్. ఎక్కడా కన్నతండ్రి కానరాకపోయేసరికి కంగారుపడ్డాడు.

"పక్కింటి పరమేశంగారింటికి గాని వెళ్లారేమో" భార్య మాట పూర్తవకుండానే ఒక్క ఉదుటున బయటకొచ్చాడు ప్రణవ్. పరమేశంగారింటికే కాదు ఆయనకు తెలిసిన వాళ్లందరి ఇళ్లకు వెళ్లాడు. ఎక్కడా తండ్రి జాడ లేకపోవడంతో మరింత ఢీలా పడిపోయాడు.

ఆయన ఆరోగ్యం ఈమధ్య అంత బావుండడం లేదు. పదిరోజుల క్రితం పెరాలసిస్ స్ట్రోక్ వచ్చింది. లేకుంటే మరింత నరకయాతన పడవలసి వచ్చేది. రెగ్యులర్‌గా మెడికల్ చెకప్ చేయిస్తూ బిపి నార్మల్‌గా ఉండేలా జాగ్రత్తపడుతున్నారు డాక్టర్లు.

తల్లి బ్రతికున్నంతకాలం బాగానే ఉండేవారు. ఆమె పోయి రెండేళ్లవుతోంది. అప్పటినుంచే అతడి ఆరోగ్యం క్షీణించడం మొదలైంది. కన్నతండ్రిని అతడి కర్మకు విడిచిపెట్టలేక తనతో తీసుకొచ్చాడు. క్రమం తప్పకుండా మందులిప్పిస్తున్నాడు.

అతడెక్కడికెళ్లాడో తెలీక ఊరంతా తిరిగి రాత్రి తొమ్మిదింటికి ఇంటికొచ్చాడు ప్రణవ్.

"మావయ్య ఏమైనా చిన్నపిల్లాడటండీ తప్పిపోవడానికి. మన బంధువులెవరింటికో వెళ్లి ఉంటారు. టెన్షన్ పడకుండా కాళ్ళు కడుక్కొని రండి అన్నం వడ్డిస్తాను. ఆఫీసునుంచి వచ్చిందగ్గర్నించి వచ్చి మంచినీళ్లయినా ముట్టుకోలేదు" పెనిమిటీ అవస్థను చూసి ఆవేదనగా అంది కీర్తన.

"బాగా గుర్తుచేశావు. ఉండు. మనచుట్టాలందరికీ ఇప్పుడే ఫోన్‌చేసి కనుక్కుంటాను" అని చెప్పి గబగబా డైరీ తెరిచి నెంబర్లన్నీ డయల్ చేశాడు. అయినా ఎక్కడా అతని తండ్రి ఆచూకీ తెలియరాలేదు.

ఊళ్ళోను లేక బంధువులెవరింటికీ వెళ్లక ఇంకెక్కడికెళ్లినట్టు? ఆలోచిస్తున్న కొద్దీ మతిపోతోందతడికి.

చెప్పా పెట్టకుండా వెళితే వెళ్లాడు ఏ అఘాయిత్యం చేయకుండా ఎక్కడో అక్కడ క్షేమంగా ఉంటే అంతేచాలనుకున్నాడు. దిలీప్, అర్చన తాతయ్య ఏడని అడిగితే ఏదో సర్దిచెప్పాడు. నాన్న ఏమైపోయాడోనన్న బెంగతో అతడికారాత్రి కంటి మీద కునుకులేదు.

మర్నాడు ఆఫీసుకు సెలవుపెట్టి పోలీస్ కంప్లైంట్ ఇద్దామని స్టేషన్‌కు బయలుదేరాడు.

త్రోవలో కొలీగ్ కార్తీక్ కనపడడంతో "మా నాన్నగారిని నువ్వెక్కడైనా చూశావా?" అని అడిగాడు.

"ఆ మాట చెబుదామనే మీ ఇంటికొస్తున్నాను" అన్నాడు కార్తీక్.

"చెప్పు ఎక్కడున్నారాయన?" మరింత ఆదుర్దా వ్యక్తంచేశాడు ప్రణవ్.

"నిన్న సాయంత్రం ఆయన ఎటో వెళుతూ కనిపించి తను ఓల్డేజ్‌హోంలో చేరుతున్నానని చెప్పారు. అదేమిటండీ అని అడిగితే అది అంతే అంటూ వెళ్లిపోయారు. నేనో ముఖ్యమైన పనిమీద వెళుతూ ఉండడం వల్ల వెంటనే నీకా కబురు అందజేయలేకపోయాను. నాకు తెలీక అడుగుతాను మీ నాన్నగారెందుకు ఆ నిర్ణయం తీసుకున్నారు? ఇంట్లో మీరెవరైనా ఆయనతో గొడవపడ్డారా?" అడిగాడు కార్తీక్.

ఆ మాటకు సిగ్గుతో కుంచించుకుపోయాడు ప్రణవ్.

"అలాంటిదేదీ లేదు. సరే ఇప్పటికైనా విషయం తెలిసింది. వస్తాను థ్యాంక్స్" అంటూ పరుగుపరుగున వృద్ధాశ్రమానికి బయలుదేరాడు.

రిసెప్షన్ కౌంటర్లో పేరు చెప్పి అతడుండే గదికెళ్లాడు.

మౌనంగా భగవద్గీత పారాయణ చేస్తున్న తండ్రిని చూసి "ఎందుకీ పనిచేశావ్ నాన్నా?" అన్నాడు బాధగా.

"ఇప్పుడేమైందని అంతగా దిగులుపడిపోతున్నావురా. ఇదేమీ వన్యమృగాలుండే అడవి కాదు కదా! ఒక్కముక్కలో చెప్పాలంటే వృద్ధులపాలిట దేవాలయాలివి. ఏ దిక్కూలేని వారికి ఈ ఆశ్రమాలు ఆశ్రయమిచ్చి సేదతీరుస్తున్నాయి"

"అదేమిటి నాన్నా అలా అంటావ్? నీకెవరూ లేకపోవడం ఏంటి? మేమంతా ఏమయ్యాం? నీకోసం దిలీప్, అర్చన బెంగపెట్టుకున్నారు. ఇంటికి రా నాన్నా" అన్నాడు ప్రణవ్.

"వద్దు. నేను రాను. నాకోసం మీరెవ్వరూ బెంగపెట్టుకోవద్దు. రేపు మీరు చేద్దామనుకున్న పనే నేనివాళ చేశాను"

నిప్పురవ్వలా ఆ మాట గుండెలకు చురుక్కుమని తాకడంతో నివ్వెరపోయాడు ప్రణవ్.

మొన్న తనకీ కీర్తనకీ మధ్య జరిగిన సంభాషణ మదిలో మెదిలింది. దాంతో కళ్ళు గిర్రున తిరిగినట్లైంది.

* * *

"నేను చెప్పినపని ఏం చేశారు?" అడిగింది కీర్తన భర్తకు పాలగ్లాసు అందిస్తూ.

ఏమిటన్నట్లు చూశాడు ప్రణవ్.

"ఇప్పటినుంచే అంత మతిమరుపైతే ఎలాగండి? మీ నాన్నని ఓల్డేజీహోంలో చేర్పించే విషయం ఏమైనా ఆలోచించారా?" గుర్తుచేసింది కీర్తన.

"అది ఇప్పుడంత అవసరమంటావా?"


"మీకు అవసరం కాకపోవచ్చు. నాకు మాత్రం అవసరమే. మీకేమండి ఉదయాన్నే హాయిగా ఆఫీసుకెళ్లిపోతారు, చీకటిపడితే గాని రారు దినమంతా ఇంట్లో ఉండేది నేనే కదా! పొద్దస్తమానూ ఆయనను భరించలేకుండా ఉన్నాను. ప్రతిదానికీ ఇతరుల మీద ఆధారపడడం ఆ ముసలాయనకి బాగా అలవాటైపోయింది. చేసేవాళ్లుంటే చేయించుకోడానికేం?"

అర్ధాంగి మాటలలో రవంత విసుగుదల ధ్వనిస్తోంది.

"చూడు కీర్తన ఆయన్ని మనం ఇప్పుడు ఆశ్రమంలో చేర్పిస్తే ఆయనకొచ్చే పెన్షన్ వాళ్ళే తీసేసుకుంటారు. ఆ సంగతి తెలుసా?" అన్నాడు ప్రణవ్.

"తీసుకుంటే తీసుకోనివ్వండి. ఆ డబ్బేం నాకు అక్కర్లేదు. నెలనెలా వెయ్యిరూపాయలు పైనే

ఆయన గారి మందులకు మాకులకు ఖర్చవు తోంది''



"అలా అనకు. పిల్లలు పెరుగుతున్న కారణంగా మనింట్లో ఖర్చులు కూడా పెరుగుతున్నాయి. నా జీతానికి ఆయన పెన్షన్ తోడౌతున్నా రోజులు భారంగా గడుస్తున్నాయి. మరి అటువంటప్పుడు...'' అంటూ అర్ధాంగి వంక సాలోచనగా చూశాడు ప్రణవ్. ఆలోచనలో పడింది కీర్తన.

"నా మాట విని కొద్దిరోజులు ఓపికపట్టు. ఆయన రిటైరై పదిహేనేళ్లు దాటిపోయాయి. మినహాయించిన కమ్యూటేషన్ సొమ్ము తిరిగి కలపడం వల్ల పెన్షన్ పెరుగుతుంది. పెద్దమొత్తంలో ఎరియర్స్ వస్తాయి. ఆ డబ్బు అందుకున్నాక నువ్వు చెప్పినట్లే చేస్తాను. కొంతకాలం ఓపిక పట్టడం మనకే మంచిది'' అన్నాడు ప్రణవ్.

భర్త ప్రపోజల్ అయిష్టంగా ఉన్నా అంగీకరించక తప్పలేదు కీర్తనకి.

★ ★ ★

నాన్న తమ సంభాషణ విని ఉంటాడు. తన స్వార్థాన్ని చూసి ఎంతగా అసహ్యించుకుని ఉంటాడో? ఎంత బాధపడి ఉంటాడో? ఇవాళ కాకుంటే రేపైనా తనని ఆశ్రమంలో చేర్పించడం ఖాయమనుకున్నాడు.

అయినాసరే తనని నిర్దయగా ఆశ్రమానికి తగలేశారనే అపప్రథ కొడుకు, కోడలికి అంటకూడదని వాళ్లనెవ్వరూ వేలెత్తి చూపకూడదని తలచి ముందుగా తనే ఆ నిర్ణయానికొచ్చి ఉంటాడు. అంతటి మహా మనీషికి తను మిగిల్చిందేమిటీ మానసిక క్షోభ తప్ప. ఆలోచిస్తున్న కొద్దీ తనమీద తనకే రోత పుడుతోంది. తండ్రి నైజం తనకు బాగా తెలుసు. లోతుగా ఆలోచించిగానీ ఏ నిర్ణయానికీ రాడు. వచ్చాకా దాంట్లో మరి సడలింపు ఉండదు. తనిప్పుడేమన్నా ప్రయోజనం శూన్యం. మరి మొహం చెల్లక తండ్రి దగ్గర సెలవు తీసుకుని వెనుదిరిగాడు ప్రణవ్.

★